నేడు కబడ్డీ పురుషుల జట్టు ఎంపిక

నిజాంపేట్: ఇంటర్ డిస్ట్రిక్ట్ కబడ్డీ చాంపియన్ పోటీలకు ఈనెల 24న బాచుపల్లిలోని కాసాని కబడ్డీ అకాడమీలో మేడ్చల్ జిల్లా సీనియర్ పురుషుల జట్టు ఎంపిక ఉంటుందని మేడ్చల్ జిల్లా కబడ్డీ అసోసియేషన్ సెక్రటరీ కాసాని వీరేష్ ముదిరాజ్ ఓ ప్రకటనలో తెలిపారు. మార్చి 2 నుంచి 4 వరకు నల్గొండ జిల్లా నాగార్జున సాగర్‌లో పోటీలు ఉంటాయన్నారు. క్రీడాకారులు 24వ తేదీ మధ్యాహ్నం 2.30 గంటలకు బాచుపల్లిలోని కాసాని కబడ్డీ అకాడమీకి రావాలని నిర్వాహకులు కోరారు. ఔత్సాహికులు స్థానికంగా ఉంటూ, 85 కిలోల బరువు కలిగి ఉండాలన్నారు. ఆధార్, 2పాస్ పోర్ట్ సైజు ఫొటోలు తెచ్చుకోవాలన్నారు. ఇతర వివరాలకు కోచ్‌లు చంద్రహాస్, షకీల్ 9908205333, 7396749998.

‘రైతులపై పోలీసుల దాడిని ఖండిస్తున్నాం’

రంగారెడ్డినగర్: ఆందోళన చేపట్టిన రైతులపై పోలీసుల దాడిని ఖండిస్తూ శుక్రవారం షాపూర్‌నగర్‌లో సీపీఎం ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కుత్బుల్లాపూర్ మండల కార్యదర్శి కీలుకాని లక్ష్మణ్ మాట్లాడుతూ... పోలీసుల కాల్పుల్లో పంజాబ్ రాష్ట్రానికి రైతు శుభకరన్ సింగ్ మరణించాడని, సంబంధిత పోలీసులను వెంటనే హత్యా నేరం కింద అరెస్టు చేయాలన్నారు. ఈ కాల్పుల సంఘటనపై సుప్రీం కోర్టు సిట్టింగ్ జడ్జి చేత సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. అణచివేత ద్వారా ఉద్యమాన్ని ఆపాలనుకోవడం ఫాసిస్ట్ ఆలోచన తప్ప వేరు కాదన్నారు.

‘రైతు ఉద్యమాన్ని కేంద్రం అణచివేయాలని చూస్తోంది’

నిజాంపేట్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రైతులు చేపట్టిన ఉద్యమాన్ని అణచివేయాలని చూస్తోందని సీఐటీయూ జిల్లా నాయకుడు చంద్రశేఖర్ అన్నారు. దేశరాజధాని న్యూఢిల్లీ సరిహద్దులో పోలీసులు జరిపిన కాల్పుల్లో యువరైతు శుభకరణ్‌సింగ్ మృతి చెందడాన్ని నిరసిస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో శుక్రవారం బాచుపల్లిలో నిరసన కార్యక్రమం చేపట్టారు.

వైద్య చికిత్సకు ఆర్థిక సాయం

సుభాష్‌నగర్: పేదలను ఆదుకునేందుకు ఎల్లప్పుడు సిద్ధంగా ఉంటామని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, ఎస్పీఆర్ ట్రస్ట్ చైర్మన్ సాంటిరెడ్డి పున్నారెడ్డి అన్నారు. గాజులరామారం సంహిత ఎన్‌క్లేవ్‌కు చెందిన సత్యనారాయణ రాజేష్ కుమార్తె సంస్కృతి బ్లడ్ కాన్సర్‌తో బాధపడుతూ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. శుక్రవారం పున్నారెడ్డి కుమార్తె హేమ జన్మదినాన్ని పురస్కరించుకుని వైద్యానికి అయ్యే ఖర్చు మొత్తం రూ.25వేలను సత్యనారాయణ కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా పున్నారెడ్డి మాట్లాడుతూ ఎస్పీఆర్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా మున్ముందు సామాజిక సేవా కార్యక్రమాలను కొనసాగిస్తూనే ఉంటామన్నారు.

ఎంఎల్‌ఆర్‌ఐటీలో టెక్నికల్ ఫెస్ట్

దుండిగల్: దుండిగల్‌లోని ఎంఎల్‌ఆర్‌ఐటీఎం, ఫార్మసీ కళాశాలలో శుక్రవారం నేషనల్ లెవల్ టెక్నికల్ ఫెస్ట్ వలారస్–2కే 24ను నిర్వహించారు. వివిధ కళాశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్న ఈ టెక్నికల్ ఫెస్ట్‌లో ప్రాజెక్టులను ప్రదర్శించారు. కార్యక్రమంలో బ్రిగేడర్ గణేశం, శాంతి, శ్రేయరెడ్డి, ప్రిన్సిపాల్ మురళీ ప్రసాద్, ఫార్మసీ ప్రిన్సిపాల్ అర్జబ్, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందులు తాళలేక వ్యక్తి ఆత్మహత్య

కుత్బుల్లాపూర్: ఆర్థిక ఇబ్బందులతో బాధ పడుతున్న ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శామీర్‌పేట్ మండలం దేవరయాంజాల్‌కు చెందిన డ్రైవర్ శేఖర్ (37) శుక్రవారం ఉదయం బెడ్‌రూమ్‌లోని సీలింగ్ ఫ్యాన్‌కు నైలాన్ తాడుతో ఉరి వేసుకున్నాడు. ఈ విషయాన్ని గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే అతడిని కిందకు దింపి సీఎంఆర్ ఆస్పత్రికి తరలించారు. శేఖర్‌ను పరిశీలించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. ఆర్థిక ఇబ్బందుల నేపథ్యంలోనే ఆత్మహత్యకు పాల్పడినట్లు మృతుడి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో కార్మికుడు మృతి

బిల్డర్‌తో నష్టపరిహారం ఇప్పించిన కాంగ్రెస్ నేతలు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి నియోజకవర్గానికి చెందిన సెంట్రింగ్ కార్మికుడు జి. నారాయణ ప్రమాదవశాత్తు విద్యుదాఘాతంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న కూకట్‌పల్లి కాంగ్రెస్ ఇన్‌చార్జి బండి రమేష్ స్థానిక నాయకులను కేపీహెచ్‌బీకాలనీలోని ఆసుపత్రికి పంపించి బాధితులకు న్యాయం జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా కొప్పిశెట్టి దినేష్ కుమార్, శేరి సతీష్ రెడ్డిలు బాధిత కుటుంబాలను పరామర్శించి, బిల్డర్‌తో సంప్రదింపులు జరిగి రూ.15 లక్షలు బాధిత కుటుంబాలకు అందించే విధంగా చర్యలు తీసుకున్నారు. ఆపదలో ఉన్న తమను ఆదుకున్నందుకు కాంగ్రెస్ ఇన్‌చార్జి బండి రమేష్, నాయకులకు బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

వ్యక్తి మృతదేహం లభ్యం



మృతుడు నవీన్

దుండిగల్: ఓ వ్యక్తి మృతదేహం లభ్యమైన ఘటన దుండిగల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గండిమైసమ్మలోని అపర్ణ కన్‌స్ట్రక్షన్ సమీపంలో శుక్రవారం ఉదయం ఫుట్‌పాత్‌పై ఓ వ్యక్తి మృతి చెంది పడి ఉన్నాడని పోలీసులకు సమాచారం అందింది. వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్న పోలీస్ సిబ్బంది సదరు వ్యక్తికి శవపంచనామా నిర్వహించి గాంధీ ఆస్పత్రికి తరలించారు. మృతుడు డిచ్‌పల్లికి చెందిన నవీన్‌గా గుర్తించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

చెత్త సేకరణ ఆటోపై దుండగుల దాడి



నిజాంపేట్: చెత్త సేకరణ ఆటోపై గుర్తు తెలియని వ్యక్తులు రాళ్ల దాడి చేసిన ఘటన బాచుపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది.. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఇళ్ల చెత్తను సేకరించే ఓ కార్మికుడికి చెందిన ఆటోపై శుక్రవారం మధ్యాహ్నం గుర్తు తెలియని వ్యక్తులు రాళ్లతో దాడి చేశారు. ఈ ఘటనలో ఆటో అద్దాలు ధ్వంసమయ్యాయి. ఆటో యజమాని పరమేష్‌గౌడ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఎవరైనా పాత కక్షల నేపథ్యంలో దాడికి పాల్పడ్డారా లేక మరే ఇతర కారణాలేమైనా ఉన్నాయా? అనే కోణంలో పోలీసులు విచారణ చేపడుతున్నారు.

దుకాణంలో చోరీ

కుత్బుల్లాపూర్: తాళం వేసి ఉన్న దుకాణంలోకి గుర్తు తెలియని వ్యక్తులు ప్రవేశించి నగదు తస్కరించిన ఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిస్సా రాష్ట్రానికి చెందిన మృత్యుంజయ్ సుభాష్‌నగర్ లాస్ట్‌బస్టాప్‌లో కిరాణా దుకాణం నిర్వహిస్తున్నాడు. రోజు మాదిరిగానే ఈనెల 18 రాత్రి 10.30 గంటలు దుకాణ షటర్‌కు తాళం వేసి ఇంటికి వెళ్లాడు. తిరిగి 19 ఉదయం 6 గంటలకు దుకాణానికి వచ్చి చూడగా షటర్ వంగి ఉంది. షటర్ తాళం వేసినట్లుగా ఉండటంతో తెరిచి లోనికి వెళ్లి చూడగా గల్లా పెట్టెలోని నగదు కనిపించలేదు. దీంతో గుర్తు తెలియని వ్యక్తులు షటర్‌ను వంచి దొంగతనానికి పాల్పడ్డారని బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

భద్రత కరువు

- కుత్బుల్లాపూర్ తహసీల్దార్ కార్యాలయం వద్ద కానరాని సీసీకెమెరాలు
- గతంలో పదుల సంఖ్యలో కార్యాలయంపై దాడులు
- అయినా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయడంలో విఫలం





కుత్బుల్లాపూర్ తహసీల్దార్ కార్యాలయ భవనం

సుభాష్‌నగర్: గాజులరామారంలోని కుత్బుల్లాపూర్ తహసీల్దార్ కార్యాలయంలో నిఘా నేత్రమైన సీసీ కెమెరాలు లేకపోవడంతో భద్రత లోపభూయిష్టంగా మారింది. నగరంలో అత్యధిక జనాభా కలిగిన కుత్బుల్లాపూర్ మండలంగా పేరుంది. స్థానికంగా జీడిమెట్ల, సుభాష్‌నగర్, సూరారం, గాంధీనగర్, రంగారెడ్డి నగర్ పారిశ్రామిక వాడలు ఉండడంతో దేశంలోని అన్ని రాష్ట్రాలకు చెందిన ప్రజలు ఇక్కడ నివసిస్తున్నంతో కుత్బుల్లాపూర్‌లో మినీ ఇండియా గా చెప్పుకోవచ్చు. దీంతో 20 మంది సిబ్బందితో పనిచేసే తహసీల్దార్ కార్యాలయంలో వివిధ పనుల నిమిత్తం నిత్యం వందలాదిమంది కార్యాలయానికి వస్తూ ఉంటారు. గతంలో, కబ్జారాయిలు రెవెన్యూ అధికారులు సిబ్బందిపై దాడికి పాల్పడటం హత్య యత్నానికి పాల్పడిన సంఘటనలు పదుల సంఖ్యలలో ఉన్నాయి. అలా ఇప్పటికి చాలామందిపై కేసు కూడా నమోదు చేశారు. అయినప్పటికీ కార్యాలయ భద్రతను గాలికి వదిలేశారు. ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో ఆలోచించి కార్యాలయంలో సీసీ కెమెరాలు, పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయడంలో పూర్తిగా విఫలమయ్యారు. దీంతో అప్పుడప్పుడు విధుల్లో ఉన్న సిబ్బందిపై దాడులకు పాల్పడడం పరిపాటిగా మారింది.

నిత్యం వందల సంఖ్యలో...

వివిధ పనుల నిత్యం ప్రతిరోజు కార్యాలయానికి వందల సంఖ్యలో వస్తుంటారు. కుత్బుల్లాపూర్‌లో అత్యధికంగా స్లమ్ ఏరియా ఉండడంతో ప్రాత ఏ పథకాలు ప్రవేశపెట్టిన కార్యాలయానికి తాకిడి పెద్ద సంఖ్యలో ఉంటుంది. వచ్చే జనాల వారి కదలికలు గమనించాలంటే తప్పనిసరిగా సీసీ కెమెరాలు అవసరం. ఇక్కడ సీసీ కెమెరాలు లేకపోవడంతో ఏదైనా ప్రమాదం జరిగితే వాటిని పసిగట్టాలంటే కష్టతరమైన పనిగా చెప్పుకోవచ్చు.

తహసీల్దార్ హత్య నేపథ్యంలో కొన్ని రోజులే భద్రత..

నగర శివారు అబ్దుల్లాపూర్‌మెట్ తహసీల్దార్ విజయరెడ్డిని అప్పట్లో కార్యాలయంలో ఓ వ్యక్తి పెట్రోల్ పోసి హత్య చేసిన ఘటన దృష్టిలో ఉంచుకొని కేవలం కొన్ని రోజులు మాత్రమే పోలీస్ భద్రతను ఏర్పాటు చేశారు. తదనంతరం భద్రాచలం గాలికి వదిలేశారు.

మచ్చుకు కొన్ని...

- 1992లో షాపూర్‌నగర్‌లో కొనసాగుతున్న కుత్బుల్లాపూర్ తహసీల్దార్ కార్యాలయంలో నలుగురు సాయుధ నక్సలైట్లు సైకిళ్లపై వచ్చి కార్యాలయంలో బాంబు విసిరారు. అది స్వల్పంగా పేలడం అక్కడ తహసీల్దార్ లేకపోవడంతో ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదు.
- గతంలో గాజులరామారం సర్వే నిర్వహిస్తుండగా కొంతమంది దాడి చేసి చైర్మన్ నర్సింగ రావును తీవ్రంగా గాయపరిచారు.
- కట్ట మైసమ్మ బస్తీ సర్వే నంబర్ 329 ప్రభుత్వ స్థలంలో కబ్జాలను అడ్డుకునేందుకు వెళ్లిన తహసీల్దార్ గౌతమ్ కుమార్, ఆర్ఐ ఉమామహేశ్వర్ గౌడ్‌లపై పెట్రోల్ దాడి చేసి అత్యాయత్నానికి ప్రయత్నించారు. దీంతో ముగ్గురిపై నాన్ బెయిలబుల్ కేసు నమోదు చేశారు.
- గాజులరామారం ఉషా ముల్లపూడి సర్వే నంబర్ 220లో ప్రభుత్వ స్థలాన్ని కాపాడేందుకు వెళ్లిన ఆర్ఐ ఉమామహేశ్వర్‌పై దాడి చేయడంతో జ్యోతిర్గుట్ట పోలీసులు కేసు నమోదు చేశారు.
- మెట్టుకానిగూడ సర్వేనెంబర్ 79 లో కబ్జాలను పరిశీలించేందుకు వెళ్లిన కలెక్టర్, ఎమ్మార్వోలపై దాడి చేసి పరుగులు పెట్టించారు. మెకానిగూడ సర్వేనెంబర్ 79 లో అప్పటి వీఆర్వో శ్యామ్, శ్రావణ లపై దాడి చేసి గాయపరిచారు.
- 2021లో సర్వేనెంబర్ 49 స్థల విషయమై కొంతమంది కార్యాలయంలో తహసీల్దార్ మహిపాల్‌రెడ్డిపై దాడికి యత్నించగా పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు.
- 2023లో సర్వే నంబర్ 307లో భారీ ఎత్తున కూల్చివేతలు జరపగా సుమారు 200 మంది కార్యాలయంపై దాడికి రాగా తహసీల్దార్ సంజీవరావు అధికారులు సిబ్బంది ప్రాణాలు కాపాడు కోవడం కోసం పరుగులు పెట్టారు.



తహసీల్దార్ కార్యాలయం వద్ద జనాల తాకిడి

త్వరలో ఏర్పాటు చేస్తాం...



ఇక్కడికి వచ్చినప్పటి నుంచి ఎన్నికల విధుల్లో బిజీగా ఉన్నాను. సీసీ కెమెరాల అంశాన్ని ఇటీవలే ఆలోచించాం. త్వరలో కార్యాలయం, ఆవరణలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి భద్రత కల్పిస్తాం.

– అబ్దుల్ రెహమాన్ ఖాన్, కుత్బుల్లాపూర్ తహసీల్దార్

నేడు లోక్‌సభ ఎన్నికల అధికారుల ప్రత్యేక సమావేశం

ఎన్నికల రిటర్నింగ్ అధికారి పులి సైదులు



కుత్బుల్లాపూర్: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న అధికారులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటుకు చర్యలు చేపట్టారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారి సైదులు ఆధ్వర్యంలో శుక్రవారం కుత్బుల్లాపూర్ సర్కిల్ కార్యాలయంలో ఎన్నికల అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. శనివారం జరిగే సమావేశం సంబంధించిన వివరాలను ఆయన అడిగి తెలుసుకున్నారు. అసిస్టెంట్ ఎన్నికల అధికారులతో పాటు పోలీస్ ఉన్నతాధికారులు, ఫ్లైయింగ్ స్క్వాడ్, ఇతర ఎన్నికల విధుల్లో పాల్గొనే సుమారు వందమంది సిబ్బందితో కలిసి సమావేశం ఏర్పాటు చేస్తున్నారు. ఎందుకు తగ్గ ఏర్పాట్లను చేయాలని ఉప కమిషనర్ నరసింహకు ఆదేశాలు జారీ చేశారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో పనిచేసిన సిబ్బందితో లోక్‌సభ ఎన్నికల్లో సైతం ఎన్నికల ప్రక్రియ సజావుగా జరిగేలా చర్యలు చేపడుతున్నట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి సైదులు ‘సాక్షి’తో అన్నారు. ప్రతి పోలింగ్ స్టేషన్లో 1500 కు పైగా ఓటర్లు నమోదయి ఉంటే అదనంగా మరొక పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేస్తామన్నారు. ఎంపీ ఎన్నికలకు సంబంధించిన నోటిఫికేషన్ వచ్చేసరికి నోడల్ అధికారులు, సిబ్బంది తమకు కేటాయించిన పోలింగ్ కేంద్రాల పూర్తి వివరాలను తెలుసుకోవాల్సి ఉంటుంది.

అసెంబ్లీ ఎన్నికల తర్వాత పెరిగిన ఓటర్లు 13,629..

- 2023 అసెంబ్లీ ఎన్నికల్లో 6,99,130 మంది ఓటర్లు ఉండగా తాజా గణాంకాల ప్రకారం ఎంపీ ఎన్నికలకు 7,12,759 ఓటర్లుగా నమోదు అయ్యారు. పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో గత నెలలో ప్రత్యేక ఓటర్ నమోదు ప్రక్రియ చేపట్టడంతో సుమారు 13629 మంది కొత్తగా ఓటు హక్కు నమోదు చేసుకున్నారు. దీంతో పురుషులు 3,72,639 మహిళలు 3,39,962 ఇతరులు 158 మందిగా ఉన్నారని తేల్చారు. గతంలో 583 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయగా తాజాగా పెరిగిన జాబితా ప్రకారం మరో 10 నుండి 20 వరకు పోలింగ్ కేంద్రాలను కొత్తగా ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామని సైదులు పేర్కొన్నారు.

సదరన్ అకాడమీతో సెయింట్ మార్టిన్స్ ఒప్పందం



అవగాహన ఒప్పందం కుదుర్చుకుంటున్న సెయింట్ మార్టిన్స్ యాజమాన్యం

సుభాష్‌నగర్: సెయింట్ మార్టిన్స్ ఇంజినీరింగ్ కళాశాల, సిడ్నీకి చెందిన సదరన్ అకాడమీ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్‌ల మధ్య సహకారం విషయమై శుక్రవారం అవగాహన ఒప్పందం జరిగింది. ఈ సందర్భంగా సెయింట్ మార్టిన్ డైరెక్టర్ సంతోష్‌కుమార్ పాత్రా మాట్లాడుతూ.. ఈ ఒప్పందంతో తమ విద్యార్థులకు పరిశోధన, ఉన్నత విద్య కోసం కన్సల్టింగ్ వంటి విషయాల్లో లబ్ధి చేకూరనుందన్నారు. ఈ అవగాహన ఒప్పందంలో సదరన్ అకాడమీ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ ప్రతినిధి డాక్టర్ జాన్, డీన్, కళాశాల చైర్మన్ మర్రి లక్ష్మణ్‌రెడ్డి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ చంద్రశేఖర్‌యాదవ్, డైరెక్టర్ జైకిసాన్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణి ఫిర్యాదులు పరిష్కరించడంలో విఫలం

కుత్బుల్లాపూర్: ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను పరిష్కరించడంలో అధికారులు చర్యలు చేపట్టడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. గత నాలుగు పర్యాయాలుగా జరిగిన ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదుల పరిష్కారంలో ఎటువంటి కదలిక లేకుండా పోయింది. కేవలం మొక్కుబడిగా ప్రజావాణి నిర్వహిస్తూ మమ అనిపిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఉన్నతాధికారులు మాత్రం ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదుల విషయంలో నిర్లక్ష్యం వహించకుండా వారం రోజుల్లో వాటికి పరిష్కార మార్గాలు అన్వేషించాలని ఆదేశాలు జారీ చేస్తున్నప్పటికీ, ఇక్కడ ఆయా విభాగాల వారీగా వచ్చిన ఫిర్యాదుల విషయంపై ఎటువంటి చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. ఆయా విభాగాల వారీగా ఫిర్యాదులను పంపించాల్సిన అధికారులు సైతం వాటిని తమ వద్దే పెట్టుకొని కాలయాపన చేయడం మూలంగా వందలాది ఫైళ్లు మూలన పడి ఉన్నాయని, చిన్నచిన్న సమస్యలను కూడా పరిష్కరించకుండా కాలయాపన చేయడం ఎంత వరకు సమంజసమని సంక్షేమ సంఘం ప్రతినిధులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదుల విషయంపై చర్యలు తీసుకోవలసిన అవసరం ఎంతైనా ఉంది.

ఎన్నా చెరువులో గుర్రపు డెక్క తొలగింపు పనులు షురూ



ఎన్నాచెరువులో గుర్రపు డెక్క తొలగింపు పనులను పరిశీలిస్తున్న ఉపకమిషనర్

కుత్బుల్లాపూర్: జీడిమెట్ల డివిజన్ వెన్నెలగడ్డ ఎన్నా చెరువులో ఉన్న గుర్రపు డెక్క తొలగింపు ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. కొన్ని నెలలుగా చెరువు మొత్తం గుర్రపు డెక్క ఏపుగా పెరిగి స్థానికులకు దుర్వాసనతో పాటు దోమలతో ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో కుత్బుల్లాపూర్ సర్కిల్ ఉప కమిషనర్ నరసింహకు ఫిర్యాదులు అందడంతో ఇదే విషయాన్ని కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ అభిలాష అభినవ్‌కు వివరించారు. వెంటనే స్పందించిన ఆమె సీనియర్ ఎంటమాలజీ సంధ్య, ఎంటమాలిటీ స్టాఫ్ ఉమారాణి పర్యవేక్షణలో ఎన్నాచెరువులో పెరిగిన గుర్రపు డెక్క ఎఫ్‌టీసీ సహాయంతో తొలగింపు ప్రక్రియను చేపట్టారు. మరో నెల రోజుల్లో ఈ ప్రక్రియ పూర్తవుతుందని తెలిపారు. శుక్రవారం పనులను పరిశీలించేందుకు వెన్నెలగడ్డ చెరువును ఉప కమిషనర్ నరసింహ సందర్శించి దశలవారీగా గుర్రపు డెక్క తొలగింపు చేయాలని సిబ్బందిని ఆదేశించారు.

అపార్ట్‌మెంట్‌కు బల్క్ సిస్టమ్ పద్ధతిలో తాగునీటి కనెక్షన్

విచారణ జరిపించాలని జలమండలికి వినతి

సుభాష్‌నగర్: బల్క్ సిస్టమ్ ద్వారా ఓ అపార్ట్‌మెంట్‌కు అక్రమంగా ఇచ్చిన కనెక్షన్ విషయమై చర్యలు తీసుకోవాలని శుక్రవారం జలమండలి కేంద్ర కార్యాలయంలో సూరారం రాజీవ్‌గృహకల్ప అధ్యక్షుడు శివగౌడ్ అధికారులకు ఫిర్యాదు చేశారు. సూరారం రాజీవ్‌గృహకల్పలో 134 బ్లాక్‌లకు గాను 4వేల నివాసితులు ఉంటున్నారని, బల్క్ సిస్టమ్ ద్వారా గృహకల్పకు అందిస్తున్న తాగునీరు సరిపోవడం లేదన్నారు. అయితే బ్లాక్ 93 ముందున్న ఓ అపార్ట్‌మెంట్‌కు బల్క్ సిస్టమ్ పద్ధతిలో నీటి కనెక్షన్ ఇచ్చారని,సదరు కనెక్షన్‌పై విచారణ జరిపి తొలగించాలని కోరారు.

నీటి సరఫరాపై అధికారులతో ప్రత్యేక సమావేశం

చింతల్: షాపూర్‌నగర్ వాటర్ వర్క్స్ సబ్ డివిజన్ కార్యాలయంలో శుక్రవారం డీజీఎం అప్పలనాయుడు అధ్యక్షతన నీటి సరఫరాపై అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. షాపూర్‌నగర్ సబ్ డివిజన్ పరిధిలో ఉన్న రిజర్వాయర్ల ద్వారా కొనసాగుతున్న నీటి సరఫరా విషయమై సెక్షన్ మేనేజర్లను వివరాలు అడిగారు. సబ్‌డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో నీటి సరఫరా సక్రమంగా జరగడంలేదని ఫిర్యాదులు వచ్చిన నేపథ్యంలో లైన్‌మెన్‌లు, సెక్షన్ మేనేజర్లతో సమావేశమైనట్లు పేర్కొన్నారు. ఇందులో భాగంగా ఎగువ ప్రాంతంలో ఉండే బస్తీలు, కాలనీల్లో నీటి సరఫరాలో అవంతరాలు తలెత్తకుండా లైన్‌మెన్‌లు సమన్వయంతో పని చేయాలన్నారు. అదే విధంగా సిబ్బంది కార్యాలయానికి హాజరయ్యే విషయంలో సమయపాలన పాటించేలా చర్యలు తీసుకోవాలని మేనేజర్లను ఆదేశించారు. ఈ సమావేశంలో సెక్షన్ మేనేజర్లు రమ్య భారతి, రోహిణి, అనూష పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరికలు

సుభాష్‌నగర్: కాంగ్రెస్ ప్రభుత్వం అమలు పరుస్తున్న ఆరు గ్యారంటీలకు ఆకర్షితులై పలువురు పార్టీలో చేరుతున్నారని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ కొలన్ హన్మంతరెడ్డి అన్నారు. శుక్రవారం దేవేందర్‌నగర్‌లో జరిగిన కార్యక్రమంలో అఫ్జల్, రియాజ్ ఖాన్, మాస్టర్ సాబ్, ముక్తార్ అహ్మద్, మొహ్మద్ జాకీర్ ఆధ్వర్యంలో పెద్ద సంఖ్యలో పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరగా వారికి కొలన్ హన్మంతరెడ్డి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానిచారు.

- ఈ సందర్భంగా హన్మంతరెడ్డి మాట్లాడుతూ.. ఇప్పటికే సీఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలో ఇచ్చిన ఆరు గ్యారంటీల్లో రెండంటిని అమలు పరిచిందన్నారు. మరో నెల రోజుల వ్యవధిలో పూర్తి గ్యారంటీలను అమలు పరిచేందుకు ముందుకు సాగుతున్నామన్నారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి విజయానికి కార్యకర్తలు సమష్టిగా పని చేయాలని కోరారు.ఈకార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు, అనుబంధ కమిటీల సభ్యులు ఉన్నారు.

నాణ్యమైన విద్యుత్ సరఫరా చేస్తాం

- జీడిమెట్ల డీఈ వై.నర్సింహారెడ్డి
- ఏడీఈ,ఏఈ లతో సమావేశం
- త్వరలో అందుబాటులోకి రెండు 11కేవీ ఫీడర్లు



విలేకరుల సమావేశంలో మాట్లడుతున్న డీఈ నర్సింహారెడ్డి

జీడిమెట్ల: విద్యుత్ వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేయడంతో పాటు ఎల్లప్పుడు అందుబాటులో ఉంటామని జీడిమెట్ల డీఈ వై.నర్సింహారెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన జీడిమెట్లలోని విద్యుత్ కార్యాలయంలో ఏడీఈ, ఏఈలతో కలిసి విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతేడాది ఫిబ్రవరి నెలలో 79.39 మిలియన్ యూనిట్‌ల విద్యుత్ సరఫరా చేశామన్నారు. ఈ ఏడాది ఫిబ్రవరికే 84.82 మిలియన్ యూనిట్‌ల విద్యుత్ సరఫరాను వినియోగదారులకు ఎలాంటి లోటు లేకుండా అందుబాటులోకి తెచ్చామని అన్నారు.

- అన్ని సబ్‌స్టేషన్‌ల పరిధిలో విద్యుత్ డిమాండ్ కంటే ఎక్కువగానే అందుబాటులో ఉందని తెలిపారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని ఇప్పటికే రూ.1.60కోట్లతో 20డీటీఆర్‌లు మరో రెండు అదనంగా, రూ.46లక్షలతో 9డీటీఆర్‌లు, రూ.1.40కోట్లతో 47కిలో మీటర్ల ఎల్‌టీ లైన్, రూ.26లక్షలతో 11కిలోమీటర్ల లైన్ పనులను ఇప్పటికే పూర్తిచేశామని తెలిపారు. రూ.48లక్షలతో రెండు 11కేవీ ఫీడర్స్ నిర్మిస్తున్నామని అవి త్వరలోనే వినియోగదారులకు అందుబాటులోకి వస్తాయని అన్నారు. సమావేశంలో ఏడీఈ బాలకృష్ణ, వీరేశలింగం, ఏఈలు ప్రసూన, కృష్ణ, సురేందర్‌రెడ్డి, సమ్మయ్య, సాయికిరణ్ పాల్గొన్నారు.

వదంతులు నమ్మొద్దు..

- ఒకవేళ ఏవైనా మరమ్మతులు, టెక్నికల్ సమస్యలు ఉంటేనే విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందే తప్పా కావాలని సరఫరాను నిలిపివేయమని అన్నారు. ఏదైనా ప్రాంతంలో మరమ్మతులు కారణంగా నిలిపివేయాలనుకుంటే ముందుగానే వార్తా పత్రికల ద్వారా వినియోగదారులకు సమాచారం ఇస్తున్నామని అన్నారు. వినియోగదారుల కోసం రాత్రివేళల్లో ప్రతి సబ్‌స్టేషన్‌లో ఇద్దరు సిబ్బందిని అందుబాటులో ఉంచుతున్నామని తెలిపారు.

ఇబ్బందులు ఉన్నా, సమాచారం కొరకు కింది నెంబర్లలో అధికారులను నేరుగా సంప్రదించవచ్చు

1. శ్రీరాం మోహన్	(ఎస్ఈ కుత్బుల్లాపూర్ మేడ్చల్)	9440813129
2. వై.నర్సింహారెడ్డి	(డీఈ జీడిమెట్ల)	7901093673
3. ఎం.బాలకృష్ణ	(ఏడీఈ జీడిమెట్ల)	9440813143
4. పి.వీరేషలింగం	(ఏడీఈ షాపూర్‌నగర్)	8332873043
5. పి.ప్రసూన	(ఏఈ ఐడీఏ జీడిమెట్ల)	9440813162
6. డి.సమ్మయ్య	(ఏఈ ప్రగతినగర్)	7382068437
7. బి.సాయికిరణ్	(ఏఈ బౌరంపేట్)	8985535434
8. అర్.కృష్ణ	(ఏఈ షాపూర్‌నగర్)	9440813163
9. ఎస్.సురేందర్‌రెడ్డి	(ఏఈ డీసీ.పల్లి)	9491038350
10. ఎఫ్‌వోసి	(జీడిమెట్ల)	9490153517
11. ఎఫ్‌వోసి	(షాపూర్‌నగర్)	9490153520